kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

శుక్రవారం 20-03-2026 పేజీలు: 8






ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. చంటిబిడ్డ మొదలు వృద్ధుల వరకు అన్ని సెక్షన్ల ప్రజలకు ధీమా కల్పించేలా సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మొత్తం రూ. 3.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో దాదాపు రూ. 1.04 లక్షల కోట్లను సంక్షేమానికే వెచ్చిస్తున్నది. మొత్తం ఖర్చులో ఇది మూడవ వంతు. ఆరు గ్యారంటీల అమలుకే రూ. 50 వేల కోట్లకు పైగా కేటాయించింది. చిన్నారులు, విద్యార్థులు, యువత, చేనేత, మహిళలు, వృద్ధులు, ఆదివాసీ-గిరిజనులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. ఇలా అన్ని సెక్షన్ల ప్రజలనూ గమనంలోకి తీసుకున్నది. సంక్షేమానికి చిరునామాగా బడ్జెట్‌ను రూపొందించింది. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి భరోసానిచ్చేలా ఉచితంగా జీవిత బీమాను కల్పించింది. ప్రీ-ప్రైమరీ స్కూల్ మొదలు జూనియర్ కాలేజీ వరకు ఉచిత బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రవేశపెడుతున్నది. ఇందుకోసం బడ్జెట్‌లోనూ నిధులను కేటాయించింది.

## గొప్పల కోసం అబద్ధాలు చెప్పం

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అద్దం పట్టేలా బడ్జెట్ రూపొందించాం. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, పారదర్శకతతో పాలన సాగిస్తున్నాం. గొప్పల కోసం మేం అబద్ధాలు చెప్పం. ఈ ప్రభుత్వం వాస్తవాల పునాదుల మీద పని చేస్తుంది. మభ్యపెట్టే మాయమాటలు చెప్పడం.. ప్రశ్నించిన వారిని దూషించడం మా నైజం కాదు. బాధ్యతతో ఎవరు ప్రశ్నించినా, బాధ్యతతోనే వారికి సమాధానం చెప్తాం. బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు, ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలు. బడ్జెట్ ప్రజల జీవన స్థితి గతుల మార్పుకు దోహదపడే లెక్కలు.

- బడ్జెట్ స్పీచ్‌లో భట్టి విక్రమార్క

# అందరికీ బీమా

హిస్టారికల్ స్కీమ్.. 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'

ప్రతి ఫ్యామిలీకి రూ. 5 లక్షల ఇన్సూరెన్స్

2026-27 బడ్జెట్‌లో ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రవేశపెట్టిన భట్టి


- జూనియర్ కాలేజీల్లోనూ బ్రేక్ ఫాస్ట్, మిడ్ డే మిల్స్
- చేయూతలో కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత స్కీమ్
- అదనంగా సమగ్ర ప్రమాద బీమా పథకం
- రూ. 4 వేలకు చేరని వృద్ధాప్య పెన్షన్.. స్పష్టత లేని నిరుద్యోగ భృతి
- ఆరు గ్యారంటీలకు రూ. 50 వేల కోట్లు

## దేశంలోనే ఫస్ట్ టైమ్..

రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి ధీమా కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించింది. ఏదేని పరిస్థితుల్లో ప్రమాదం జరిగితే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడకూడదన్న లక్ష్యంతో ఐదు లక్షల రూపాయల మేర ఆర్థిక సాయం అందేలా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రవేశపెట్టింది. ఈ ఏడాది రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి ఇది అమలులోకి రానున్నది.

## ఇంటర్‌కూ బ్రేక్ ఫాస్ట్, మిడ్ డే మిల్స్

రాష్ట్రంలోని ప్రీ-ప్రైమరీ పాఠశాలలు మొదలు జూనియర్ కాలేజీల వరకు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అందించనున్నది. ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం కూడా అమల్లోకి రానున్నది. ఇవి రెండూ రానున్న విద్యా సంవత్సరం (జూన్) నుంచి అమలవుతాయి. ప్రస్తుతం అమలవుతున్న 'చేయూత' స్కీమ్‌లో కొత్తగా అర్హులైన రెండు లక్షల మందికి లబ్ధి చేకూరనున్నది. దీనికి తోడు ఐటీఐ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు)లలో ట్రైనీలుగా శిక్షణ పొందుతున్న ప్రతీ ఒక్కరికి నెలకు రూ. 2 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందనున్నాయి.






## 'చెవిలో పువ్వు'.. విపక్షాల నిరసనలు

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదని బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కొత్త పథకాలను ప్రస్తావించి ప్రజలను మరోసారి మోసం చేసిందని ఆరోపించారు. డిప్యూటీ సీఎం బడ్జెట్ ప్రసంగంపై అసంతృప్తిని వ్యక్తం చేసి చెవిలో పూలు పెట్టకుని అసెంబ్లీ ఎంట్రన్స్ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో ఆర్భాటమే తప్ప వాస్తవికత లేదని ఆరోపించారు.

కేసీఆర్ డుమ్మా ..5లో

## బడ్జెట్ స్వరూపం

| | |
|---|---|
| మొత్తం బడ్జెట్ | : 3,24,134 కోట్లు |
| రెవెన్యూ మిగులు | : 6,857 కోట్లు |
| ద్రవ్య లోటు | : 54,458 కోట్లు |
| ప్రాథమిక లోటు | : 37,154 కోట్లు |
| మొత్తం ఆదాయం | : 3,24,134 కోట్లు |
| రాష్ట్ర పన్ను ఆదాయం | : 1,48,185 కోట్లు |
| కేంద్రం నుంచి రాష్ట్ర పన్నుల వాటా | : 33,181 కోట్లు |
| నాన్-టాక్స్ రెవెన్యూ | : 35,730 కోట్లు |
| కేంద్ర గ్రాంట్లు | : 24,166 కోట్లు |
| అప్పల ద్వారా | : 73,383 కోట్లు |
| కేంద్రం నుంచి లోన్‌లు | : 5,500 కోట్లు |
| ఇతర రూపాల్లో రెవెన్యూ | : 3,987 కోట్లు |
| మొత్తం ఖర్చు | : 3,24,134 కోట్లు |
| రెవెన్యూ ఖర్చు | : 2,34,405 కోట్లు |
| వడ్డీ చెల్లింపులకు | : 21,304 కోట్లు |
| అభివృద్ధి పనులకు | : 47,267 కోట్లు |
| లోన్లు, అడ్వాన్సులకు | : 19,536 కోట్లు |
| పాత అప్పల పేమెంట్ | : 19,785 కోట్లు |
| కేంద్రం, ఇతర రుణాల రీ-పేమెంట్ | : 3,138 కోట్లు |

బడ్జెట్‌పై మరిన్ని కథనాలు 2, 3, 4, 5, 6, 7, 8 పేజీల్లో

శుక్రవారం, 20-03-2026
kalamdaily.com
Follow on: Kalamtelugu







## భట్టికి ఇది నాల్గోసారి..

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక మంత్రి హోదాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ను ప్రవేశపెడ్తున్నారు. 2024 ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను, అదే ఏడాది జులైలో ఫుల్ బడ్జెట్‌ను సభ ముందుంచారు. అనంతరం 2025 మార్చిలో ఫుల్ బడ్జెట్ ను ఆయన సమర్పించారు. లేటెస్ట్ దానితో కలిపి భట్టి బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది నాల్గోసారి.

ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం సాగుతున్నదని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అంబేద్కర్ అడుగు జాడల్లో రాష్ట్రాభివృద్ధికోసం ముందుకు సాగుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక, వ్యవస్థల విధ్వంసాన్ని సెట్ చేస్తూ.. పాలనను గాడిలో పెట్టామని తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ.. వాగ్దానాల అమలుకు శక్తించన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. “మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవలకులం. ప్రజలు మాకు అప్పగించిన ఈ అధికారాన్ని బాధ్యతగా భావించి.. ప్రజా సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం” అని పునరుద్ఘాటించారు. వరుసగా నాల్గో సారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాన్ని ఇచ్చి రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ ను ఆయన శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మధ్యాహ్నం 12 గంటలకు స్పీచ్ ప్రారంభించారు. రెండు గంటల పాటు కొనసాగింది.

- కలం, తెలంగాణ బ్యూరో



# సేవకులం.. కాపలాదారులం

## అంబేద్కర్ అడుగుజాడల్లో మా ప్రయాణం.. బడ్జెట్ స్పీచ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


ప్రసంగంలో భట్టి ఏమన్నారంటే.. ‘‘అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్నదే మా లక్ష్యం. అందుకోసమే అహర్నిశలు శ్రమిస్తున్నాం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగాం. ధీరోదాత్తుడు ఎన్నడూ తనకెదురైన అవరోధాలకు బెదరడు. అవరోధాలనే అవకాశాలుగా మలచుకొని ముందుకు సాగుతాడు. మేమెంచుకున్న లక్ష్యాలవైపు అడుగులేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లెక్క చేయక ముందుకు సాగుతున్నాం. ప్రతి పైసకు మేం కాపలాదారులుగా ఉంటున్నాం. బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు, ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలు. బడ్జెట్ ప్రజల జీవన స్థితి గతుల మార్పుకు దోహదపడే లెక్కలు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలను నిజం చేసే సంకల్ప పత్రమే ఈ బడ్జెట్.

### తెలంగాణ వృద్ధి రేటే ఎక్కువ

2025-26 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం 17 లక్షల 82 వేల 198 కోట్ల రూపాయలు. గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు 10.7 శాతంగా నమోదైంది. దేశ జీడీపీ 3 కోట్ల 57 లక్షల 13 వేల 886 కోట్ల రూపాయలు కాగా, వృద్ధిరేటు 8 శాతంగా ఉంది. తెలంగాణ వృద్ధి రేటు దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువగా ఉంది. అదే విధంగా దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్డీపీ 5.0 శాతం వాటా కలిగి దేశానికి ఒక బలమైన ‘గ్రోత్ ఇంజిన్’ గా తెలంగాణ నిలుస్తున్నది. దేశ వృద్ధిరేటు తగ్గుతూ మందగమనంలో ఉన్నప్పటికీ, మన రాష్ట్ర వృద్ధిరేటులో మెరుగైన పెరుగుదల కనబడుతున్నది. ప్రస్తుత ధరల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 9.8 శాతంగా ఉన్న దేశ జీడీపీ వృద్ధి రేటు, 2025-26 నాటికి 8 శాతానికి పడిపోయింది. కానీ, సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణ జీఎస్డీపీ వృద్ధిరేటు 2024-25 లో 10.6 శాతం నుంచి 2025-26 నాటికి 10.7 శాతానికి పెరిగింది.

### ఏప్రిల్ 26 నుంచి జనగణన

స్థానిక సంస్థల ఏర్పాట్లు, రిజర్వేషన్ల అమలు వంటి ప్రజాస్వామ్య ప్రక్రియలకు మూలాధారమైన జనగణనను డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి జనగణన ఇది. దీనిలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానం, కుల గణన అంశం ఉన్నాయి. మొదటి దశలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు కొనసాగుతుంది. జనగణన 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు ఉంటుంది. రెండవ దశ దేశవ్యాప్తంగా 2027 ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తారు. తదుపరి, మార్చి 1, 2027 తేదీని రిఫరెన్స్ డేట్‌గా తీసుకుంటారు’’ అని తెలిపారు.




### తలసరి ఆదాయం 1.9 రెట్లు ఎక్కువ

రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో, ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931 కాగా, వృద్ధి రేటు 10.2 శాతం. దేశ తలసరి ఆదాయం రూ.2,19,575 కాగా వృద్ధిరేటు కేవలం 6.9 శాతం. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,99,356 ఎక్కువ. అంటే 1.9 రెట్లు ఎక్కువగా ఉంది.



### కోటీ 15లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా

రాష్ట్ర ప్రజలందరికీ జీవిత బీమా కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల జీవిత బీమా అందించే విధంగా ‘ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం’ తీసుకువస్తున్నట్లు బడ్జెట్ లో భట్టి విక్రమార్క వెల్లడించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి ఇది అమలులోకి వస్తుందని తెలిపారు. “తెలంగాణ రాష్ట్రంలో పుట్టడం, ఇక్కడే జీవించడం ఒక వరం అనే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పిస్తుంది. ఒక కుటుంబంలో ఆదాయం తెచ్చే వ్యక్తి దురదృష్టవశాత్తు అకస్మాత్తుగా దూరమైతే... ఆ కుటుంబం పడే మానసిక వేదన ఒకటైతే, వాళ్లు ఎదుర్కొనే ఆర్థిక విపత్తు మరొకటి. ఒక్క సంఘటనతో ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. ఆ భయం, ఆ అభద్రతాభావం ఏ ఒక్క తెలంగాణ బిడ్డకు ఉండకూడదన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ప్రపంచంలోని ఏ అభివృద్ధి చెందిన దేశానికీ సాధ్యంకాని రీతిలో, కనివిని ఎరుగని ఒక మహత్తర జీవిత బీమా పథకానికి ఈ బడ్జెట్‌లో శ్రీకారం చుడుతున్నాం” అని బడ్జెట్ లో భట్టి విక్రమార్క ప్రకటించారు. పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా చూడకుండా రాష్ట్రంలోని అందరికీ ఈ బీమా పథకం వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు.




## ఓయూకు వెయ్యి కోట్లు



భూవిజ్ఞాన, ఖనిజ శాస్త్ర పరిశోధనలకు ప్రత్యేకంగా డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్థాపించామని.. అలాగే రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో న్యాయ, ఇంజినీరింగ్ కళాశాలల ద్వారా కొత్త ప్రొఫెషనల్ కోర్సులు ప్రారంభించినట్లు ప్రభుత్వం తెలిపింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెయ్యి కోట్ల రూపాయలు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి 400 కోట్ల రూపాయలు ఈ బడ్జెట్ లో ప్రతిపాదిస్తున్నట్లు తెలిపింది.



## ఇంటర్‌లోనూ బ్రేక్ ఫాస్ట్, మిడ్ డే మిల్స్

ప్రభుత్వ స్కూళ్లతోపాటు ఇకపై ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్‌లో ప్రభుత్వం ఓకే చెప్పింది. "ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నాం. విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక సరికొత్త అధ్యాయానికి నాంది" అని భట్టి తెలిపారు.

- 2026–27 విద్యా సంవత్సరం నుంచి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు కూడా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు, మిగతా మూడు రోజులు రాగిజావ అందిస్తామని తెలిపారు.
- బ్రేక్ ఫాస్ట్, మిడ్ డే మీల్స్ పథకాలద్వారా 430 కాలేజీల్లో చదువుతున్న సుమారు రెండు లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది.





# ఎడ్యుకేషన్‌కు బూస్టప్

## రూ. 26,674 కోట్లు కేటాయింపు

**కలం, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో విద్యా రంగానికి బడ్జెట్లో నిధుల కేటాయింపులు నిరుడుతో పోలిస్తే పెరిగాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ లో రూ.23,108 కోట్లను ప్రతిపాదించగా.. ఈసారి రూ.26,674 కోట్లకు పెంచింది. గతేడాది బడ్జెట్తో పోలిస్తే ఈసారి రూ.3,556 కోట్లు పెరిగాయి.

### ఇంటిగ్రేటెడ్ గురుకులాలు

''ఏ దేశ భవిష్యత్తైనా విద్యతోనే నిర్మితమవుతుంది. ఈ సత్యాన్ని గుర్తించిన ప్రభుత్వం విద్యారంగంలో చారిత్రాత్మక మార్పులు తీసుకొచ్చే దిశగా అడుగులు వేస్తోంది. నాణ్యమైన, నైపుణ్యం కలిగిన విద్యను అందించాలనే సంకల్పంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేయాలని నిర్ణయించాం" అని బడ్జెట్ స్పీచ్ లో భట్టి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులు ఒకేచోట చదువుకునేందుకు వీలుగా అధునాతన వసతులతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే 79 స్కూళ్లు మంజూరు చేసినట్లు తెలిపింది.

### ఉన్నత విద్య

రాష్ట్రంలో పాలమూరు, శాతవాహన విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, లా కాలేజీలు, తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కాలేజ్, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో లా, ఫార్మసీ కాలేజీలు, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ క్యాంపస్ ను మంజూరు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ కోస్గిను ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేశామని చెప్పింది.

### ప్రాథమిక విద్య

ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 33 జిల్లాల్లో 1,362 ప్రీ-ప్రైమరీ విభాగాలను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్లు ప్రభుత్వం తెలిపింది. రాబోయే విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని 2,000 నుంచి 2,500 ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించనుంది. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు 2025–26 విద్యా సంవత్సరంలో 93 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలను యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రకటించి, 120 కేజీబీవీలను ఇంటర్మీడియట్ స్థాయికి పెంచినట్లు ప్రభుత్వం తెలిపింది.


### రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల

ఇంటర్మీడియట్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

### హాస్టళ్లలో వంటశాలల ఆధునీకరణ

రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలల్లోని వంటశాలల అపరిశుభ్రత వలన విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని.. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆ వంటశాలల నిర్వహణలో వస్తున్న ఇబ్బందులను అధిగమించడానికి, వాటిని ఆధునీకరించడానికి ప్రభుత్వం నిశ్చయించిందని భట్టి తెలిపారు. ఈ బడ్జెట్ లో అన్ని వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల వంటశాలల ఆధునీకరణకు 100 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నట్లు వెల్లడించారు.

## పుష్కర కాలంలో మూడున్నర రెట్లు..



రాష్ట్ర బడ్జెట్ అంతకంతకూ పెరుగుతున్నది. తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత వచ్చిన తొలి బడ్జెట్ (2014–15) మొత్తం రూ. లక్షా 637 కోట్లు. ఆ తర్వాత 2018లో అసెంబ్లీని రద్దు చేసే ముందు కేసీఆర్ సర్కార్ పెట్టిన బడ్జెట్ లక్షా 75వేల కోట్లు. తిరిగి అధికారంలోకి వచ్చాక మరో 15వేల కోట్లకు పైగా బడ్జెట్ సైజ్ పెరిగింది. 2021–22 వచ్చే సరికి రెండు లక్షల కోట్ల మార్క్ ను రాష్ట్ర బడ్జెట్ దాటిపోయింది. రెండో టర్మ్ చివర్లో కేసీఆర్ సర్కార్ పెట్టిన బడ్జెట్ (2023–24) రూ. 2.90 లక్షల కోట్లపైనే! అంటే.. పదేండ్లలోనే దాదాపు మూడు రెట్లు తెలంగాణ బడ్జెట్ పెరిగిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెట్టిన తొలి బడ్జెట్ రూ. 2 లక్షల 91 వేల 159 కోట్లు. 2025–26 ఏడాదికి గాను రూ. 3 లక్షల 4వేల 965 కోట్లను ప్రతిపాదించింది. ఇప్పుడు అది కాస్త 3,24,234 కోట్లకు చేరింది. తెలంగాణ వచ్చిన 12 ఏండ్లలో బడ్జెట్ దాదాపు మూడున్నర రెట్లు పెరిగింది.

**రాష్ట్ర బడ్జెట్.. కొన్ని ఇలా..**

| | |
|---|---|
| 2014-15 | 1,00,637 కోట్లు |
| 2015-16 | 1,15,689 కోట్లు |
| 2016-17 | 1,30,415 కోట్లు |
| 2017-18 | 1,49,646 కోట్లు |
| 2018-19 | 1,74,453 కోట్లు |
| 2019-20 | 1,46,492 కోట్లు |
| 2020-21 | 1,82,914 కోట్లు |
| 2021-22 | 2,30,825 కోట్లు |
| 2022-23 | 2,56,958 కోట్లు |
| 2023-24 | 2,90,396 కోట్లు |
| 2024-25 | 2,91,159 కోట్లు |
| 2025-26 | 3,04,965 కోట్లు |
| 2026-27 | 3,24,234 కోట్లు |

## ఆ హామీలకు మరో 'సారీ'

**కాంగ్రెస్ మేనిఫెస్టోలోని పలు హామీలు ఇంకా అమలుకు నోచుకోకపోవడంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేండ్లవుతున్నదని, ఈ బడ్జెట్ లోనైనా వాటికి మోక్షం కలుగుతుందని ప్రజలు ఎదురుచూశారు. కానీ, అవేవీ ఈ బడ్జెట్ ముందుకు రాలేదు. అందులో కొన్ని..**

- చేయూత పథకం కింద వృద్ధులకు పెన్షన్ రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో తెలిపింది. ఇప్పటికీ పాత పింఛన్లే అమలవుతున్నాయి. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నామని బడ్జెట్ లో భట్టి ప్రకటించారు.
- మహాలక్ష్మి స్కీమ్ కింద మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఆర్థిక సాయం అందజేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ చెప్పింది. దీనిపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. తాజా బడ్జెట్ లోనూ ఎలాంటి ఊసు లేదు.
- 18 సంవత్సరాలు పైబడి, చదువుకునే ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లను అందజేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ చెప్పినప్పటికీ.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లవుతున్నా దీనిపై తాజా బడ్జెట్ లోనూ ఉలుకూ లేదు పలుకూ లేదు.



- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకు ప్రతి నెల రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అదీ పెండింగ్ లోనే ఉంది.




### ఇప్పటివరకు ఈటలదే రికార్డు..

తెలంగాణలో తొలి బడ్జెట్‌ను ఈటల రాజేందర్ ప్రవేశపెట్టారు. కేసీఆర్ ఫస్ట్ టర్మ్‌లో ఆర్థిక మంత్రిగా పని చేసిన ఆయన.. వరుసగా ఐదుసార్లు బడ్జెట్ సమర్పించారు. 2014–15, 2015–16, 2016–17, 2017–18, 2018–19 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 2018లో కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లి, మళ్లీ సీఎం అయ్యారు. ఆ టైమ్‌లో ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకున్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2019 ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను, 2019 సెప్టెంబర్‌లో ఫుల్ బడ్జెట్‌ను కేసీఆర్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఆర్థిక శాఖ మంత్రి అయిన హరీశ్ రావు వరుసగా నాలుగుసార్లు బడ్జెట్ సమర్పించారు. ఆయన 2020–21, 2021–22, 2022–23, 2023-24 బడ్జెట్‌లను సభ ముందుంచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక మంత్రి అయ్యారు. ఆయన ఇప్పటి వరకు మూడుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు.




# హెల్త్‌కు వెల్త్

## బడ్జెట్‌లో రూ.13,679 కోట్లు.. గతేడాదితో పోలిస్తే 10% పెంపు

**గత ఐదేండ్ల కేటాయింపులు..**

| ఏడాది | నిధులు |
|---|---|
| 2025 – 26 | 12,393 కోట్లు |
| 2024 – 25 | 11,468 కోట్లు |
| 2023 – 24 | 12,161 కోట్లు |
| 2022 – 23 | 11,237 కోట్లు |
| 2021 – 22 | 6,295 కోట్లు |



ప్రభుత్వం హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు నిధులు పెంచింది. గతేడాది బడ్జెట్‌లో వైద్యారోగ్య శాఖకు రూ.12,393 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.13,679 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే10.38 శాతం నిధులు పెంచింది. తాజా బడ్జెట్‌లో నిర్వహణ పద్దు కింద రూ.6,984 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.6,695 కోట్లు ప్రతిపాదించింది.

- హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు రూ.629 కోట్లు, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు రూ.1,844 కోట్లు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు రూ.3,018 కోట్లు, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు రూ.552 కోట్లు, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు రూ.2.1 కోట్లు, హోమియోపతి–ఆయుష్ డిపార్ట్‌మెంట్‌కు రూ.155 కోట్ల చొప్పన ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది.
- రాష్ట్రంలోని ప్రజలందరీ హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేసి, డిజిటల్ హెల్త్ కార్డులు అందజేస్తామని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది.
- కొత్తగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టామని.. ఇప్పటికే 9 మెడికల్, 16 నర్సింగ్, 28 పారా మెడికల్ కాలేజీలు కొత్తగా ప్రారంభించామని ప్రభుత్వం వెల్లడించింది.
- ప్రభుత్వ పరిధిలోని ఆస్పత్రుల్లో 2026 చివరి నాటికి మొత్తం 44,029 బెడ్స్ అందుబాటులోకి వస్తాయని సర్కార్ తెలిపింది.

### ఆరోగ్యశ్రీకి పాత నిధులే..

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి ప్రభుత్వం నిధులు పెంచలేదు. గతేడాది రూ.1,143 కోట్లు కేటాయించగా, ఈసారీ అంతే మొత్తం కేటాయించింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. కొత్తగా 160 చికిత్సలను పథకంలో చేర్చింది. ఈ స్కీమ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2.84 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు.

# ఉద్యోగులకు ఆరోగ్య భద్రత

**కొన్ని దశాబ్దాల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురు చూస్తున్న నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ పథకం ఉద్యోగస్తులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ వర్తిస్తుంది. ఇది ప్రభుత్వ ఉద్యోగస్తులకు, పెన్షనర్లకు ఈ ప్రభుత్వం కల్పిస్తున్న భద్రత, భరోసా అని తెలిపింది.**


- ‘‘ఈ నగదు రహిత ఆరోగ్య భద్రత (ఈహెచ్ఎస్) పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తాం. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 421 ఎంపానెల్ ప్రయివేట్ ఆసుపత్రులలో 1,998 వ్యాధులకు ఈ పథకం ద్వారా చికిత్సను పొందవచ్చు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందిస్తాం. ఈ పథకం ద్వారా దాదాపు 23 లక్షల 51 వేల మంది ప్రభుత్వ ఉద్యోగస్తులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు లబ్ధి పొందుతారు” అని భట్టి విక్రమార్క వెల్లడించారు.
- ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు బడ్జెట్ లో భట్టి తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే 1 కోటి 20 లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. 60 ఏండ్ల వరకు 10 లక్షల రూపాయాల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే 2 కోట్ల రూపాయలు అదనపు కవరేజీ లభించే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేశామని చెప్పారు. ఈ పథకం 7 లక్షల 57 వేల ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తిస్తుంది.
- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ ప్రయోజనాలను మంజూరు చేస్తూ, టీచర్లకు 2 లక్షల రూపాయలు, హెల్పర్లకు లక్ష రూపాయలు ఇస్తున్నామని భట్టి తెలిపారు. 60 ఏండ్ల వయసులో స్వచ్ఛందంగా విధుల్లోంచి విరమించుకున్న వారికి కూడా ఈ ప్రయోజనాలు అందుతాయన్నారు.



కలం
శుక్రవారం, 20-03-2026
kalamdaily.com
Follow on:
Kalamtelugu




## వచ్చే ఏడాది జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు



పన్నెండేళ్లకు ఒకసారి అత్యంత పవిత్రంగా జరుపుకునే గోదావరి పుష్కరాలు తెలంగాణ రాష్ట్రంలో 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరుగుతాయని బడ్జెట్ లో భట్టి విక్రమార్క వెల్లడించారు. ''ఈ పవిత్ర దినాల్లో సుమారు 8 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా 'కుంభమేళా' తరహాలో ఈ పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పుష్కరాల నిర్వహణ, రోడ్ల విస్తరణ, కొత్త ఘాట్ల నిర్మాణం, దేవాలయాల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి ఏర్పాట్లను పర్యవేక్షించడానికి మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్ఆపటు. గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం బడ్జెట్ లో రూ. 500 కోట్లు ప్రతిపాదిస్తున్నాం" అని వివరించారు.

# ఆరు గ్యారంటీలకు ₹ 50వేల కోట్లు

**కలం, తెలంగాణ బ్యూరో: 2026–27 బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు రూ.56,084 కోట్ల నిధులు కేటాయించారు. నిరుడు రూ.50,713 కోట్లు ప్రతిపాదించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి సుమారు రూ.6వేల కోట్ల నిధులు తగ్గాయి. వీటికి బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. ఈ బడ్జెట్ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం అట్టడుగు వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే అని తెలిపింది.**

## నిరుడు 56,084 కోట్లు.. ఈసారి 50,713 కోట్లు

## రైతు భరోసా, చేయూతకు పాత కేటాయింపులే..

## ఇందిరమ్మ ఇండ్లకు రూ.5,500 కోట్లు

## సన్న వడ్ల బోనస్‌కు రూ.3,500 కోట్లు




### మహాలక్ష్మి



రాష్ట్రంలోని మహిళల ఆర్థిక స్వావలంబన, గౌరవం, భద్రతను పెంపొందించడమే మహాలక్ష్మి ప్రధాన ఉద్దేశ్యం. ముఖ్యంగా మధ్యతరగతి, పేద కుటుంబాల్లోని మహిళలకు రోజువారీ ఖర్చుల నుంచి ఉపశమనం కలిగించేలా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళల ప్రయాణ, జీవన వ్యయాలను తగ్గించడానికి ఈ పథకానికి కాంగ్రెస్ సర్కార్ శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీని కోసం 2025–26 బడ్జెట్ లో రూ.4,305 కోట్లు కేటాయిస్తే.. ఈసారి కూడా రూ.4,305 కోట్లు ప్రతిపాదించింది. అదేవిధంగా, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అమల్లో ఉంది. ఈ అర్హులైన వారికి రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నది. దీని కోసం 2025–26 బడ్జెట్‌లో రూ.723 కోట్లు కేటాయిస్తే.. ఈసారి కూడా రూ.723 కోట్లు కేటాయించింది.

### రైతు భరోసా

రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండగలా మార్చాలనే లక్ష్యంతో, రైతులకు పెట్టుబడి కష్టాలు తీర్చడానికి రూపొందించిన అత్యంత కీలకమైన పథకం రైతు భరోసా. ప్రతి ఏటా ఎకరానికి రూ.12,000 చొప్పున పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తాన్ని వానాకాలం (ఖరీఫ్), యాసంగి (రబీ) సీజన్లకు విడదీసి, సీజన్కు రూ.6,000 చొప్పున రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నది. 2025–26 బడ్జెట్‌లో రైతు భరోసా స్కీమ్ కోసం రూ.18వేల కోట్లు కేటాయించగా.. ఈసారి కూడా రూ.18,000 కోట్లు కేటాయించింది. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున అదనపు సాయం అందిస్తున్నది. దీని కోసం ఈ సారి బడ్జెట్‌లో రూ.3,500 కోట్లు కేటాయించింది. నిరుడు దీనికి కోసం రూ.1,800 కోట్లు ప్రతిపాదించింది.



### గృహజ్యోతి



సామాన్య, మధ్యతరగతి ప్రజల ఇండ్లలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో గృహజ్యోతి పథకాన్ని కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చింది. పెరుగుతున్న విద్యుత్ భారాల నుంచి ఉపశమనం కలిగించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. సాధారణంగా ఒక సగటు కుటుంబానికి విద్యుత్ బిల్లు అనేది ప్రతి నెలా ఒక పెద్ద ఆర్థిక భారం. ఈ భారాన్ని తగ్గించి, పొదుపు చేసుకునే అవకాశాన్ని కల్పించడానికి ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. దీనివల్ల రాష్ట్రంలోని కోట్లాది మంది వినియోగదారులకు జీరో బిల్లు వస్తున్నది. నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ను వినియోగించే గృహ వినియోగదారులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేసింది. నెలకు సగటున రూ.500 నుంచి రూ.1,000 వరకు విద్యుత్ బిల్లు రూపంలో కుటుంబానికి ఆదా అవుతుంది. 2025–26 బడ్జెట్‌లో గృహజ్యోతి స్కీమ్‌కు రూ.2,080 కోట్లు కేటాయించింది. ఈసారి కూడా రూ.2,80 కోట్లు కేటాయించింది.

### చేయూత



శారీరక వైకల్యం, వృద్ధాప్యం లేదా కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం ఒక 'చేయూత'గా నిలుస్తున్నది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, బీడీ కార్మికులు, ఫైలేరియా బాధితులకు నెలకు రూ.4వేల చొప్పున పెన్షన్ అందించడం ఈ పథకం లక్ష్యం. 2025–26 బడ్జెట్‌లో ఆసరా పెన్షన్ల కోసం రూ.14,861 కోట్లు కేటాయించగా.. ఈసారి కూడా రూ.14,861 కోట్లు కేటాయించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద నిరుడు బడ్జెట్‌లో రూ.1,143 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.1,143 కోట్లు ప్రతిపాదించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా (భూమిలేని కూలీలకు) 2025–26 బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించగా.. ఈసారి కూడా అంతే రూ.600 కోట్లు కేటాయించింది.

### యువ వికాసం



**ప్రభుత్వం యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో, కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీల్లో యువ వికాసం పథకాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా తీర్చిదిద్దింది. ఈ పథకం కేవలం విద్యకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఉన్నత చదువులు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన అనే 3 ప్రధానాంశాలతో కలిసి రూపొందించింది. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యను అందించడం, చదువు పూర్తికాగానే వారు స్వయం సమృద్ధి సాధించేలా ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. 2025–26 బడ్జెట్‌లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు, నైపుణ్య శిక్షణ కోసం రూ.6వేల కోట్లు కేటాయించింది. ఈసారి బడ్జెట్‌లో రూ.5,800 కోట్లు కేటాయించింది. పెండింగ్లో ఉన్న ఫీజులను చెల్లించడానికి, కొత్త స్కాలర్ షిప్‌ల కోసం నిరుడు బడ్జెట్‌లో రూ.4,452 కోట్లు కేటాయించగా.. ఈసారి బడ్జెట్‌లో రూ.4,343 కోట్లు ప్రతిపాదించింది. యువ వికాసం పథకం కింద.. ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థుల కోసం రూ.5 లక్షల వరకు విద్యా భరోసా కార్డును అందజేస్తున్నది. దీని ద్వారా కాలేజీ ఫీజులు, హాస్టల్ ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందుతున్నది. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన గురుకుల పాఠశాలలను ఈ స్కీమ్ కింద నిర్మిస్తున్నది. ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులందరికీ ఒకేచోట నాణ్యమైన విద్య అందుతున్నది.**

### ఇందిరమ్మ ఇండ్లు




**"సొంత గూడు లేని పేదవాడు ఉండకూడదు" అనే లక్ష్యంతో, గృహ నిర్మాణ రంగానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా కాంగ్రెస్ సర్కార్ కొత్త ఊపిరి పోసింది. గతంలో ఉన్న గృహ నిర్మాణ పథకాల కంటే భిన్నంగా, లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సాయం అందించడం దీని ప్రత్యేకత. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్న పేదలకు, అసలు స్థలమే లేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. ఇది కేవలం ఒక ఇల్లు కట్టించి ఇవ్వడం మాత్రమే కాదు, ఒక కుటుంబానికి సామాజిక భద్రతను, ఆత్మగౌరవాన్ని కల్పించే ప్రయత్నమని ప్రభుత్వం ప్రకటించింది. 2025–26 బడ్జెట్ లో రూ.12,571 కోట్లు కేటాయించింది. ఈసారి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూ.5,500 కోట్లు ప్రతిపాదించింది. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. ఇల్లు కట్టుకునేటప్పుడు పునాది నుండి స్లాబ్ వరకు వివిధ దశల్లో ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నది. గ్రామ, వార్డు స్థాయిల్లో 'ఇందిరమ్మ కమిటీలు' ఏర్పాటు చేసి, అర్హులైన వారిని పారదర్శకంగా ఎంపిక చేస్తున్నారు.**

## ప్రతిపక్ష నేత డుమ్మా

**ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్.. బడ్జెట్ రోజు కూడా అసెంబ్లీకి హాజరుకాలేదు. ఈ నెల 16న గవర్నర్ ప్రసంగానికీ హాజరుకాని ఆయన.. శుక్రవారం బడ్జెట్ రోజు కూడా గైర్హాజరయ్యారు. పూర్తిగా బడ్జెట్ సమావేశాలకే డుమ్మా కొడతారా? అన్న చర్చ నడుస్తున్నది. అసలు ఈ రెండున్నరేండ్లలో కేవలం మూడేసార్లు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు.**



- కేసీఆర్ మొదటిసారి 2024 జులై 25న బడ్జెట్ సమావేశాల సందర్భంగా భట్టి బడ్జెట్ స్పీచ్ పూర్తయ్యేంత వరకు సభలో ఉండి వెళ్లిపోయారు.
- రెండోసారి గతేడాది మార్చి 12న బడ్జెట్ సెషన్ ఫస్ట్ డే హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగం పూర్తయ్యేంత వరకు ఉండి వెళ్లిపోయారు.
- మూడోసారి గతేడాది డిసెంబర్ 29న శీతాకాల సమావేశాల మొదటి రోజు హాజరై, సభలో కేవలం మూడు నిమిషాలే ఉండి వెళ్లిపోయారు.
- 2023 డిసెంబర్ నుంచి అసెంబ్లీకి రాకుండానే కేసీఆర్ రూ.1.06 కోట్ల జీతం తీసుకున్నారు.

కలం
శుక్రవారం, 20-03-2026
kalamdaily.com
Follow on:
Kalamtelugu




## గతం కంటే 6.5% పెరిగిన బడ్జెట్

ఏటా రాష్ట్ర బడ్జెట్ సగటున 14% మేర పెరుగుతుందని సాధారణ అంచనా. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి దాదాపు 6.5శాతం మేర పెరిగింది. 2025–26 బడ్జెట్ మొత్తం రూ. 3,04,965 కోట్లు. ప్రస్తుత బడ్జెట్ మొత్తం రూ 3,24,234 కోట్లు. గత బడ్జెట్ తో పోలిస్తే తాజా బడ్జెట్ లో రూ. 19,269 కోట్ల మేర నిధులు పెరిగాయి.







## రైతు సంక్షేమమే ధ్యేయం

దేశానికి అన్నం పెడుతున్న రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా మేం భావిస్తున్నామని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. "రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో వ్యవసాయ దిగుబడులలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. రైతులకు పెట్టుబడి సహాయం కోసం రైతు భరోసా పథకం ద్వారా ప్రతీ సీజన్ కు ఎకరాకు 6,000 ల చొప్పున రెండు పంటలకు కలిపి సంవత్సరానికి 12,000 రూపాయలు సహాయం అందిస్తున్నాం. రైతులకు మద్దతు ధరను ఇవ్వడం కోసం వారికి ప్రోత్సాహకంగా సన్నవడ్లకు క్వింటాకు 500 రూపాయల చొప్పున అందజేస్తూ, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తున్నది. దీని ద్వారా, ప్రతి ఎకరానికి రైతుకు సగటున దాదాపు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని పరిగణిస్తే, ఒక్క సీజన్ కు ఎకరానికి రైతుకు సుమారు 12 వేల 500 రూపాయల ఆదాయం లభిస్తోంది. దీని వలన రైతుకు సంవత్సరానికి రెండు పంటలకు కలిపి 25 వేల రూపాయల అధిక ఆదాయం లభిస్తుంది. 2024-25 సంవత్సరంలో 284 లక్షల 16 వేల మెట్రిక్ టన్నుల వరి 1 కోటి 27 లక్షల ఎకరాలలో పండింది. ఫిలిప్పైన్స్ కు 22 వేల 750 మెట్రిక్ టన్నుల బియ్యం తెలంగాణ నుంచి ఎగుమతి చేయడం జరిగింది. దీనిద్వారా మన బియ్యానికి డిమాండు పెరిగి, రైతాంగానికి మరింతగా మద్దతు ధర లభించింది. రాష్ట్రంలో ఉద్యాన పంటల విస్తీర్ణం సుమారు 13 లక్షల ఎకరాలుగా ఉంది. మామిడి, సీతాఫలం, మిరప, పసుపు, నారింజ వంటి పంటల అభివృద్ధికి మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. 79 వేల 287 మంది రైతులు 2 లక్షల 90 వేల 466 ఎకరాలలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నారు. ఈ పంటను మరో 68 వేల ఎకరాలలో విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించాం. మైక్రో ఇరిగేషన్ పద్ధతులను 2 లక్షల 34 వేల ఎకరాలలో అమలు చేయాలని నిర్ణయించాం. ఈ బడ్జెట్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి 23,179 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము"అని భట్టి అసెంబ్లీలో తెలిపారు.

# రైతన్నకు భరోసా

## వ్యవసాయ రంగానికి ఈసారి రూ.23,179 కోట్లు

### రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.600 కోట్లు

**కలం, తెలంగాణ బ్యూరో**

బడ్జెట్‌లో గతేడాది వ్యవసాయ రంగానికి రూ.24,439 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.23,179 కోట్లు ప్రతిపాదించింది. ఇందులో రైతు భరోసా పథకానికే తాజాగా రూ.18,000 కోట్లు ప్రతిపాదించింది. బీఆర్ఎస్ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా ఎకరానికి రూ.10 వేలు అందేది. కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది జనవరి 26న రైతు భరోసా స్కీము ప్రారంభించి, ఏటా ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నది. ఈ నేపథ్యంలో 2025-26 బడ్జెట్‌లో పెట్టుబడి సాయానికి రూ.18,000 కోట్లు కేటాయించగా, ఈసారి కూడా రూ.18,000 కోట్లే అలాట్ చేసింది. పంట బీమా పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బడ్జెట్‌లో రూ. 1,886 కోట్లు కేటాయించింది. గత బీఆర్ఎస్ సర్కార్ పంట బీమా పథకాన్ని అమలు చేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథ కాన్ని ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. పంట బీమా అమలుతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంట నష్టపోతే రైతులకు పరిహారం అందనున్నది. ఇక ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఇప్ప టికే అమలు చేస్తున్నామని, దీని కింద రైతు కూలీలకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని బడ్జెట్ లో ప్రభుత్వం తెలిపింది. అలాగే, రైతు బీమా పథకం అమలు చేస్తున్నామని, దీని కోసం రూ.6కోట్లు కేటాయిస్తు న్నట్టు ప్రకటించింది.




## బాకీ కార్డులతో బీఆర్ఎస్ నిరసన

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదంటూ బీఆర్ఎస్ పార్టీ నిరసనకు దిగింది. బడ్జెట్ ప్రసంగానికి ముందు గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ఆ పార్టీ నేతలు 'బాకీ కార్డు'లతో ప్రదర్శన చేపట్టారు. ఇందులో కేటీఆర్, హరీశ్రావు, సబితా ఇంద్రారెడ్డి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ తదితరులు పాల్గొన్నారు. ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, ఎన్నో హామీలు ఇచ్చి బుట్టదాఖలు చేసిందని కేటీఆర్ మండిపడ్డారు.




### తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళు


ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక, మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలు, ప్రత్యేక రవాణా వ్యవస్థలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళు'గా మార్పు. ప్రీ-ప్రైమరీ నుండి ఇంటర్ వరకు 1500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య. బడ్జెట్‌లో రూ.500 కోట్ల కేటాయింపు.




# సాగునీటికి రూ.22,615 కోట్లు

## గతేడాదితో పోలిస్తే రూ.758 కోట్లు తక్కువ

## ప్రాణహిత చేపడతామని ప్రభుత్వం ప్రకటన



బడ్జెట్‌లో ఇరిగేషన్‌కు ప్రభుత్వం నిధులు తగ్గించింది. గత బడ్జెట్‌లో రూ.23,373 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.22,615 కోట్లు మాత్రమే కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.758 కోట్లు తగ్గించింది. తాజా బడ్జెట్‌లో ప్రగతి పద్దు కింద రూ.11,871 కోట్లు ప్రతిపాదించింది.

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును చేపడతామని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాజెక్టు పేరును మార్చి, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. అయితే అందులో ముఖ్యమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది.
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కొడంగల్ ఎత్తిపోతల పథకాలు, ఎస్ఎల్‌బీసీ, ఉదయసముద్రం, డిండి, దేవాదు, సీతారామ ఎత్తిపోతలు, గౌరవెల్లి, ఎర్రుపాలెం తదితర ముఖ్యమైన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపింది.
- ప్రాజెక్టుల్లో పూడికతీత పనులు చేపడతామని బడ్జెట్‌లో సర్కార్ ప్రకటించింది.

**గత ఐదేండ్లలో ఇరిగేషన్‌కు కేటాయింపులు..**

| ఏడాది | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|
| 2025–26 | 23,373 |
| 2024–25 | 22,301 |
| 2023–24 | 26,885 |
| 2022–23 | 22,675 |
| 2021–22 | 16,931 |

## పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ


తెలంగాణ ప్రభుత్వం 2026- –27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి (పీఆర్ & ఆర్డీ) శాఖకు రూ. 33, 688 కోట్లు కేటాయించింది. ఈ విభాగానికి గతేడాది (2025––26 )బడ్జెట్‌లో రూ. 31,605 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈసారి అదనంగా రూ. 2,083 కోట్లు ఇచ్చింది. ఇందులో భాగంగా పంచాయతీ రాజ్ రోడ్ల విభాగం కింద హ్యామ్ రోడ్ల (ఆధునీకరణ, నిర్వహణ )కు రూ. 1,372 కోట్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ. 750 కోట్లు , గ్రామీణాభివృద్ధి రోడ్ల నిర్వహణ ( ఎఫ్ డీఆర్ ఫండ్స్)కు రూ. 500 కోట్లు కేటాయించగా.. మొత్తంగా రూ. 2,622 కోట్లు ఇవ్వనుంది. తద్వారా గ్రామీణ రోడ్ల అభివృద్ధి బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ నిధులు ఇచ్చింది.



## మున్సిపల్, పట్టణాభివృద్ధికి అదనంగా నిధులు

రాష్ట్ర ప్రభుత్వం 2026–27 బడ్జెట్‌లో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు మొత్తంగా రూ. 17,907 కోట్ల నిధులు కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో రూ.17,677 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఈసారి అదనంగా రూ. 230 కోట్లు కేటాయింపు చేసింది. నగరాలు, పట్టణాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చింది.






## సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం

యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణను, వారికి ఉపాధి లభించిన దేశాల్లో భాషా జ్ఞానంలో శిక్షణ ఇప్పించడం, వీసా అసిస్టెన్స్, విదేశీ ప్రయాణ ఏర్పాట్లు, విదేశాలలో ఆరోగ్య సేవలు, హస్పిటాలిటీ, నిర్మాణపు పనులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 'సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం'. బడ్జెట్‌లో రూ.1,056 కోట్ల కేటాయింపు.



### రంగం/శాఖ కేటాయింపులు (రూ.కోట్లలో)

| | | |
|---|---|---|
| ఆర్థిక శాఖ | 54,008 | 60,438 |
| ఎస్సీ సంక్షేమం | 40,232 | 11,784 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | 31,605 | 33,688 |
| వ్యవసాయ శాఖ | 24,439 | 23,179 |
| నీటి పారుదల శాఖ | 23,373 | 22,615 |
| విద్యా రంగం | 23,108 | 26,674 |
| విద్యుత్ శాఖ | 21,221 | 21,285 |
| మున్సిపల్, పట్టణాభివృద్ధి | 17,677 | 17,907 |
| ఎస్టీ సంక్షేమం | 17,169 | 7,937 |
| వైద్య ఆరోగ్య శాఖ | 12,393 | 13,679 |
| బీసీ సంక్షేమం | 11,405 | 12,511 |
| హోంశాఖ | 10,188 | 11,907 |
| పౌరసరఫరాల శాఖ | 5,743 | 7,366 |
| మైనార్టీ సంక్షేమం | 3,591 | 3,769 |
| మహిళా, శిశు సంక్షేమం | 2,862 | 3,143 |
| పశు సంవర్ధక శాఖ | 1,674 | 1,529 |
| పరిశ్రమలు | 3,527 | 3,490 |
| ఐటీ శాఖ | 774 | 875 |
| టూరిజం | 775 | 1,224 |
| అటవీ, పర్యావరణం | 1,023 | 1,049 |
| ఉపాధి సృష్టి | 900 | 998 |
| గృహ నిర్మాణం | 14,154 | 7,430 |
| గిరిజన సంక్షేమ శాఖ | 7,522 | 7,937 |
| రోడ్లు, భవనాల శాఖ | 5,907 | 12,789 |
| రవాణా శాఖ | 4,485 | 4,491 |
| న్యాయ శాఖ | 2,453 | 2,367 |
| శాసన సభ వ్యవహారాలు | 255 | 259 |
| సాధారణ పరిపాలన | 1,112 | 1,190 |
| రెవెన్యూ | 2,369 | 4,020 |
| ప్లానింగ్ | 3,863 | 7,971 |
| కార్మిక శాఖ | 900 | 998 |

### ముఖ్యమైన పథకాలకు కేటాయింపులు (రూ. కోట్లలో)

| | | |
|---|---|---|
| రైతు భరోసా | 18,000 | 18,000 |
| చేయూత | 14,861 | 14,861 |
| ఇందిరమ్మ ఇండ్లు | 12,571 | 5,500 |
| మహాలక్ష్మి (ఆర్టీసీ) | 4,305 | 4,305 |
| స్కాలర్‌షిప్‌లు, స్టైపెండ్‌లు | 4,452 | 4,343 |
| కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ | 3,683 | 3,683 |
| బియ్యం రాయితీ | 3,000 | 3,000 |
| యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు | 2,900 | 5,000 |
| గ్యాస్ రాయితీ (మహాలక్ష్మి స్కీమ్) | 723 | 723 |
| గృహ జ్యోతి (200 యూనిట్లు ఫ్రీ) | 2,080 | 2,080 |
| సన్న వడ్లకు బోనస్ | 1,800 | 3,500 |
| రాజీవ్ ఆరోగ్య శ్రీ | 1,143 | 1,143 |
| డైట్ కాలేజీలు | 2,659 | 2,170 |
| విద్యుత్ రాయితీ | 11,500 | 14,000 |
| పారిశ్రామిక రాయితీలు | 1,730 | 1,835 |
| రాజీవ్ యువ వికాసం | 6,000 | 6,000 |
| ఇందిరమ్మ ఆత్మీయ భరోసా | 600 | 600 |
| గ్రామాల్లో సోలార్ విద్యుత్ | 1,500 | 1,000 |
| గ్రీన్ ఎనర్జీ ప్రమోషన్ | 1,000 | 1,000 |
| పర్యాటక ప్రాజెక్టులు | 721 | 875 |





# సంక్షేమానికి భారీగా..

## బడ్జెట్‌లో రూ.39,144 కోట్లు

### బీసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమానికి నిధులు పెంపు


### ఈసారి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సెపరేట్

| రంగం | నిధులు | |
|---|---|---|
| | 2025-26 | 2026-27 |
| ఎస్సీ సంక్షేమం | 40,232 | 11,784 |
| ఎస్టీ సంక్షేమం | 17,169 | 7,937 |
| బీసీ సంక్షేమం | 11,405 | 12,511 |
| మైనార్టీ సంక్షేమం | 3,591 | 3,769 |
| మహిళా శిశు సంక్షేమం | 2,862 | 3,143 |

**కలం, తెలంగాణ బ్యూరో:** బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమంతో పాటు మహిళా శిశు సంక్షేమానికి నిధులు పెంచింది. ప్రభుత్వం వీటన్నింటికీ కలిపి ఈసారి బడ్జెట్‌లో రూ.39,144 కోట్లు కేటాయించింది. ఇందులో బీసీ సంక్షేమానికి రూ.12,511 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,937 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.3,769 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి రూ.3,143 కోట్లు కేటాయించింది. గతేడాదితో పోలిస్తే బీసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు ప్రభుత్వం నిధులు పెంచింది.

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమ నిధులను ప్రభుత్వం ఈసారి సెపరేట్‌గా చూపించింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కలుపలేదు.
- ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.7,757 కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.1,754 క్యారీ ఫార్వర్డ్ చేస్తామని ప్రకటించింది.
- గిరిజనుల అభివృద్ధికి 3 ప్రత్యేక కార్పొరేషన్లు, గిరిజన గ్రామాల్లో ఆదివాసీ సేవా కేంద్రాలు ఏర్పాటు.
- మహిళా శిశు సంక్షేమం కింద స్టేట్ న్యూట్రిషన్ మిషన్ ద్వారా పట్టణాల్లోని పేదలకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో ఈ ఏడాది కొత్తగా 274 మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు.
- పాలనా పథకం ద్వారా పనిచేసే మహిళల పిల్లల కోసం రాష్ట్రవ్యాప్తంగా 500 అంగన్‌వాడీ కమ్ క్రెచ్ సెంటర్లు ఏర్పాటు. వీటి ద్వారా పిల్లలకు పౌష్టికాహారంతో పాటు డే కేర్ సేవలు.

## అంబేద్కర్ బోధనల ప్రస్తావన



గ్రామ స్వరాజ్యం మొదలు సమసమాజం వరకు మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వరకు ఆశించిన లక్ష్యాలను బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రస్తావించింది. విద్య, వైద్యం, వ్యవసాయం, పౌష్టికాహారం మీద ఎక్కువ ఫోకస్ పెట్టిన ప్రభుత్వం ఆ మేరకు నిధులను కేటాయించింది. వివక్ష లేని నిర్బంధ విద్యను అందించాలని భావించిన ప్రభుత్వం "పిల్లల భవిష్యత్తు కోసం తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ ఖర్చు కాదు.. అవి పెట్టుబడులు.. అమ్మ కలలు, పిల్లల చదువు.. ఇవే తెలంగాణ భవిష్యత్తు.." అని బడ్జెట్‌లో నొక్కిచెప్పింది. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం కూడా ఆరోగ్యకరంగా ఉంటుందని భావిస్తున్న ప్రభుత్వం "దేశంలో ఎక్కడాలేని విధంగా కేవలం అభివృద్ధి చెందిన దేశాలలో మాత్రమే లభించే ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను రాష్ట్రంలోని ప్రజలందరికీ అమలు చేస్తున్నాం" అని స్పష్టత ఇచ్చింది. "ఒక దేశం పురోగతి అక్కడి మహిళల స్థితి ద్వారా కొలవబడుతుంది.." అనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూక్తిని ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో పొందుపరిచింది. రాజకీయ ప్రజాస్వామ్యం.. సామాజిక ప్రజాస్వామ్యంగా మారనంత కాలం స్వాతంత్ర్యానికి అర్థం లేదు.." అంటూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బోధనను ప్రస్తావించిన ప్రభుత్వం షెడ్యూలు కులాల, తెగల సంక్షేమానికి నిధులను కేటాయించింది.